ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023
5
శ్రీకాకుళం



24 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 24 నుంచి 28 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు చేనేత జౌళిశాఖ ఎడి ఐ.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత ఉత్పత్తిదారులను ప్రోత్సహించడంలో భాగంగా పెద్దఎత్తున ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టేందుకు ఈ ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. జిల్లాలో ఉన్న చేనేత ఉత్పత్తిదారులతోపాటు మంగళగిరి, ధర్మవరం, పోచంపల్లి, వెంకటగిరి, తదితర ప్రాంతాల్లో చేనేత ఉత్పత్తి దారులు తమ ఉత్పత్తులను విక్రయిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం ఉదాసీనత కనబరుస్తోంది. కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతా లను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలను అధికారులు పంపుతున్నా ప్రభుత్వం అంచనా వ్యయం, భూసేకరణ.. అంటూ ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కి పంపుతోంది. దీంతో వంశధార, నాగావళి కరకట్టల కొత్త పనులకు ఒక్క అడుగూ పడటం లేదు. ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు వంశధార, నాగావళిలో నీటి ప్రవాహం పెరగడంతో నదీతీర గ్రామాల ప్రజలు భయాందోళనతోనే కాలం గడిపారు.



కరకట్టలకు కొర్రీ

వరదలొస్తే వర్రీ

- 2020లోనే ప్రమాదకర వరద ముంపు ప్రాంతాల గుర్తింపు
- అధికారుల ప్రతిపాదనలకు పలుమార్లు కొర్రీలు
- మూడేళ్లుగా ఇదే తంతు
- అడుగు పడని వంశధార, నాగావళి కరకట్టల పనులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ తీర గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తా కూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగూ ముందుకు పడటం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25 శాతంలోపు ఖర్చయిన పనులను నిలిపేసి, వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు

గ్రామాలను ముంచుతున్నా ఉదాసీనమే

హిరమండలం మండలం గొట్టా బ్యారేజి వద్ద గతేడాది ఆగస్టు 15న వంశధారలో 82,470 క్యూసెక్కుల వరద నీరు రావడంతో కొత్తూరు మండలం మాతల, పెనుగోటివాడ తదితర గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. పొలాలను వరద నీరు ముంచెత్తి, రహదారులపైకి వచ్చి చేరింది. హిరమండలం మండలం అక్కరాపల్లి, రెల్లివలసలో అపరాలు, గులుమూరులో వరి చేలు వరదనీటిలో మునిగాయి. నాగావళిలో 50 వేల క్యూసెక్కులు దాటి ప్రవాహిస్తే, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కాని గతేడాది సెప్టెంబర్‌లో 42 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహానికే ఆమదాలవలస మండలం కలివరం, బూర్జ మండలం అల్లెన గ్రామాలు ముంపు బారిన పడ్డాయి.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా..

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికి కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 17.29 కిలోమీటర్ల పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపేయాలంటూ మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు

మూడేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్నాం



జిల్లాలో అత్యంత వరద ముప్పు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ప్రభుత్వం 2019లో సూచించింది అందుకనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి 2020లో పంపాం. పనులపై ప్రభుత్వం సూచించిన రిమార్కులను పరిగణనలోకి తీసుకుని తిరిగి పంపుతున్నాం. పనుల కోసం భూసేకరణ చేపట్టాలని సూచించడంతో మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- సుధాకరరావు, ప్రత్యేక కట్టడాల విభాగం ఇఇ



ఇచ్ఛాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సిఎం హామీ నెరవేర్చాలని

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్రీకాకుళంలో ఏడు రోడ్ల జంక్షన్ నుండి కార్పొరేషన్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అమ్మన్నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను 6 నెలల్లో పర్మినెంట్ చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చి నాలుగేళ్లయినా నేటికీ అమలు చేయలేదన్నారు. పెరిగిన నగర విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.గురుస్వామి, ఆకుల శంకర్, ఎ.శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలో మోనింగివారివీధి నుంచి గేటు, కృష్ణాపురం జంక్షన్ వరకు మున్సిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.సంతోష్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎన్. రాజేష్, జె.శ్రీనివాస్, జె.వాసు, డి.రాజేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ జంక్షన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ కొనసాగింది. అనంతరం రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు



శ్రీకాకుళంలో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు



హయాతీనగరంలో పర్యటిస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

చిత్తశుద్ధితో నగరాభివృద్ధికి కృషి

రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. సోమవారం నగరంలోని హయాతీ నగరం ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతమేరకు అందుతున్నాయో ప్రజలనడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు సంతోషంగా జీవించాలనే లక్ష్యంతో నాటి పాదయాత్రలో ఇచ్చిన హామీలను సిఎం జగన్ నెరవేర్చారని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పినవన్నీ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. నగరాభివృద్ధికి ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. బ్రిడ్జి నుంచి ఉల్లి గెడ్డ వరకు నాగావళి నది తీరం వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

సామాజిక మరుగుదొడ్లు, వార్డులో మిగిలిన సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అర్బన్ ఆస్పత్రిని అన్ని హంగులతో అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రిమ్స్‌లో 900 బెడ్లు అందుబాటులోకి తెచ్చి, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. మార్కెట్‌తోపాటు రూ.10 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. డంపింగ్ యార్డు సమస్య పూర్తిగా పరిష్కరించామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు మెంటాడ పద్మావతి, పైడిశెట్టి జయంతి, వైసిపి పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు, తారక, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అక్రమాలు

కలెక్టర్‌కు బూరవల్లి గ్రామస్తుల ఫిర్యాదు ● విచారణకు ఆదేశించిన శ్రీకేశ్ లాఠకర్ ● స్పందనకు 265 అర్జీలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

గార మండలం బూరవల్లి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని, బిల్లుల చెల్లింపులో వ్యత్యాసం ఉందంటూ ఆ గ్రామ యువకులు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపించినట్టు వివరించారు. నిధుల దుర్వినియోగంపై తక్షణమే విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాలని కలెక్టరు.. సమగ్రశిక్ష ఎపిసి రోణంకి జయప్రకాశ్‌ను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్తు సమావేశమందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ నవీన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ సమస్యలపై 265 అర్జీలు అందాయి. వాటిలో కొన్ని.. ● జిల్లాలో 2012లో సోంపేట ప్రాంతంలో బీలభూముల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ పేరుతో ఎన్‌సిసి సంస్థకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో 732 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారని పర్యావరణ పరిరక్షణ సమితి కార్యదర్శి బి.ఢిల్లీరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత 13 ఏళ్లుగా ఒక్క కేసులో విముక్తి లభించడం లేదని, అంతకు ముందున్న 52 కేసులను న్యాయస్థానాలు కొట్టి వేశాయని వివరించారు. ఈ కేసు వల్ల 26 గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యువకులు ఉద్యోగాల్లో చేరాలన్నా, పాస్‌పోర్టు, నియామకాల సమయంలో వెరిఫికేషన్‌కు ఇబ్బందులు పడుతున్నామని కలెక్టరుకు వివరించారు. ప్రభుత్వానికి నివేదించి ఈ కేసు నుంచి 732 మందిని విముక్తులను చేయాలని కోరారు. ఆయనతోపాటు ఎం.నాగేశ్వరరావు, పలాసపురం గ్రామస్తులున్నారు. ● సారవకోట మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రోడ్డు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఐటిడిఎ సబ్‌ప్లాన్ నిధుల నుంచి బిటి రోడ్డులను మంజూరు చేయాలని పోలాకి జెడ్‌పిటిసి సభ్యులు ధర్మాన కృష్ణచైతన్య కలెక్టర్‌ను కోరారు. ● సారవకోట మండలం అసర్లసాగరంలో పూడికతీత చేపట్టక పోవడం వల్ల ఈ ఏడాది అరకొర వర్షాలకు నీరులేని దుస్థితి నెలకొందని, దీంతో నారుమళ్లు ఎండి పోతున్నాయని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మదనాపురం సర్పంచ్ పి.స్వాతి కలెక్టర్‌ను కోరారు. ● ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకం మరమ్మతులు చేపట్టాలని, వంశధార నదికి కరకట్టలను నిర్మించాలని వైసిపి పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురపు తేజేశ్వరరావు కోరారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

వినతుల సత్వర పరిష్కారం

ప్రజల నుంచి వివిధ మార్గాల్లో వస్తున్న వినతులను తక్షణమే పరిష్కరించి ఫిర్యాదుదారులకు జవాబుదారీగా ఉండాలని జిల్లా కలెక్టరు శ్రీకేశ్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. స్పందన అనంతరం అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా స్పందనతోపాటు 1902కు వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వద్దన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ రవికుమార్, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాశ్, డిఇఒ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, డిఎంహెచ్ఒ మీనాక్షి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

26న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన శాఖ, వికలాంగుల శాఖ సంయుక్తంగా యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యాన ఈ నెల 26న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ తెలిపారు. జెడ్‌పి సమావేశమందిరంలో సోమవారం జెసి నవీన్‌తో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. జాబ్‌మేళాలో సుమారు 16 స్థానిక, బహుళజాతి ప్రయివేటు సంస్థలు పాల్గొంటాయని చెప్పారు. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ యువత, వికలాంగులు ఈమేళాకు హాజరుకావచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 6301045132, 6301275511 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయిశ్రీనివాస్, ఉపాధి కల్పనాధికారి సుధ, వికలాంగుల శాఖ ఎడి కవిత, డిపిఒ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

2023-24 విద్యా సంవత్సరానికి గాను ఐటిఐలోని వివిధ ట్రేడుల్లో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్టు ప్రభుత్వ ఐటిఐ, డిఎల్‌టిసి ఎడి వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో వివిధ ట్రేడుల్లో సీట్లు భర్తీ చేశామని చెప్పారు. మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు మూడో దఫా నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. ఈనెల 27లోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 28న సీట్ల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. మహిళలకు టైలరింగ్ ట్రేడ్‌లో చేరేందుకు వీలుగా సీట్లు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. 30న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రగతిని చాటిచెప్పాలి

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి-నరసన్నపేట

వైసిపి హయాంలో చేపట్టిన ప్రగతిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. సోమవారం నరసన్నపేటలో నిర్వహించిన జగనన్న సచివాలయాల కన్వీనర్ల నమోదు శిబిరంలో ఆయన మాట్లాడారు. చిన్న వయసులోనే సమర్థుడైన ముఖ్యమంత్రిగా సిఎం వైఎస్ జగన్ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారని చెప్పారు. మేనిఫెస్టోలో 98 శాతం హామీలను అమలుచేసి జగన్ మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపునిచ్చారని చెప్పారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్థాయికి పరిపాలన తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్లు సురంగి నరసింగరావు, నక్క తులసీదాస్, ధర్మాన జగన్, కణితి సత్తిబాబు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, బిసి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజపు హైమావతి అప్పన్న, ముద్దాడ బైరాగి నాయుడు, రౌతు శంకర్రావు పాల్గొన్నారు.

సిఎం దృష్టికి పోర్టు సమస్యలు

ప్రజాశక్తి -నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్‌కు సంబంధించి ఆర్అండ్ఆర్ కాలనీ, పోర్టు నిర్వాసితుల అభిప్రాయాలను సిఎం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ శ్రీనివాస్, వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి తెలిపారు. సోమవారం మూలపేటలో నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బాధితుల అభ్యంతరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు పెండింగ్ బకాయిలు, ఆర్అండ్ఆర్ కాలనీలో తాగునీటి వసతి కల్పిస్తామని వారు తెలిపారు. దీనిపై ఎవరూ అపోహపడద్దని, మీ సమస్యలన్నీ పరిష్కారం అయ్యేంతవరకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ శ్రీనివాసరావు, దువ్వాడ వాణి తెలిపారు. కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ చట్టబద్ధంగా నిర్వాసితులకు రావలసిన పరిహారం అందజేస్తామని తెలిపారు. అధునాతన హంగులతో నౌపడలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి జిఆర్ రాధిక, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సర్పంచ్ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

వజ్రపుకొత్తూరు : అంగన్వాడీ కేంద్రాల అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ డి.శార్వాణి అన్నారు. మండలంలోని సీతాపురం అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలవర్థకమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు ప్రత్యేక అభ్యాసన ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలను చదువుకొనేందుకు అనువుగా సంసిద్ధం చేస్తున్నామని అన్నారు. పిల్లలను అంగన్వాడీకి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. సూపర్‌వైజర్ గంగమ్మ, కార్యకర్త భాగ్యవతి ఉన్నారు.

పేరుమార్పు

రాంబాబు రౌతు No-15329525X Rank HAV అను నేను నా తండ్రి S/o ఆదినారాయణ, బాడాం గ్రామం, నడగాం పోస్టు, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-532425. నా కుమారుడు పేరు రికార్డ్స్‌లో తప్పుగా నమోద అయింది.

నా కుమారుడు పేరు **తనీష్** నుంచి **రౌతు తనీష్** గా మార్చడమైనదిగా యావన్మందికి తెలియజేసున్నాం.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి 'స్పందన'కు 32 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి 32 ఫిర్యాదులను సోమవారం స్వీకరించారు. అనంతరం ఎస్‌పి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారం చూపించాలని సూచించారు. ఇందులో కుటుంబ తగాదాలకు 4, పౌర సంబంధమైన 10, మోసపూరితమైనవి 4, పాతవి 4, ఇతర ఫిర్యాదులు 10 వచ్చాయి.



మొక్కను నాటుతున్న వాకర్సు

హరితవనంగా ఆర్ట్సు కళాశాల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రాధాన్యత ఇస్తున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ పి.జి.గుప్తా అన్నారు. నగరంలో ఆర్ట్సు కళాశాల ఆవరణలో పుట్టపర్తి జిల్లా సత్యసాయి ఆశ్రమమం నుంచి తీసుకొచ్చిన మొక్కలను సోమవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత వనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణాన్ని తయారు చేసేందుకు స్టార్ వాకర్స్ క్లబ్ ముందుకు రావటం అభినందనీయం అన్నారు. సత్యసాయిబాబా యాత్రికుడు జామి జనార్ధనరావు తీసుకొచ్చిన మేలుజాతి మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం నగరానికి సుమారు 30 వేల మొక్కలు తీసుకొచ్చారని అన్నారు. వీటిని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాటుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్, నాగేశ్వర ఈశ్వరరావు, గోలీ సంతోష్, ఉమా, మల్లిబాబు, మోహన్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- రణస్థలం

అధికారం ఉంటే చాలు ఏదైనా చేయెుచ్చు. కోర్టు ఆదేశాలు ఖాతర్ చేయాల్సిన అవసరం లేదు. అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంతో దజ్జా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు. దీని ఫలితంగా రూ.5 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి దర్జాగా వైసిపి నాయకుడు కబ్జాకు పాల్పడ్డాడు. మండల కేంద్రంలో జె.ఆర్.పురం పంచాయతీ పాత పోలీస్ స్టేషన్ వెనుక భాగం, ప్రస్తుతం ఎంపియు పి స్కూల్ ముందుభాగం రావాడ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నంబరు-2లో 18 సెంట్లు గ్రామకంఠం ఉంది. అయితే ఈ భూమిని గతంలో ఓ టిడిపి నాయకుడు ఆక్రమించుకొని భూమిని కొన్నేళ్లు అనుభవించాడు. అయితే సదరు భూమి నాదేనని వైసిపి నాయకుడు ముందుకొచ్చాడు. విజయనగరం మహారాజుల దగ్గర భూమి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ కాగితాలు చూపించి ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో టిడిపి నాయకులు కోర్టుకు వెళ్లారు. రెవెన్యూ అధికారులు కూడా గ్రామకంఠమని రికార్డులను కోర్టుకు అందజేశారు. దీంతో ఈ స్థలంపై టిడిపి నాయకులకు ఎటువంటి హక్కు లేదని కోర్టు నిర్ధారించింది. ఇలా ఉండగా... ఇటీవల దిగువ కోర్టు రిజిస్ట్రేషన్ కాగితాలు ఉన్న వైసిపి నాయకునికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న 18 సెంట్లు భూమి గ్రామకంఠంగా అధికారులు కోర్టుకు తెలిపారు. సదరు ఇద్దరి ఫిర్యాదును పరిశీలించిన కోర్టు కేసులు పెండింగ్ ఉంచింది. హైకోర్టులో ఉన్న వివాదాన్ని వైసిపి నాయకుడు ఈ భూమి ఆక్రమించే ప్రయత్నం చేశారు. సోమవారం వంద మందికి పైగా తమ అనుచరులను తెప్పించి ఆ స్థలంలోని పురాతన చెట్లను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా భయబ్రాంతులతో ఏం జరుగుతుందన్న ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం సదరు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలిసినా ప్రేక్షకుని పాత్ర వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నా పోలీసులు ఆ స్థలంలోకి వెళ్లి వైసిపి నాయకులకు వత్తాసు పలకడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన అధికారులే అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.



చదును చేస్తున్న ప్రొక్లెయినర్

హైకోర్టులో కేసు ఉంది

జె.ఆర్.పురం పంచాయతీ సర్వే నంబరు-2లో 18 సెంట్లు గ్రామకంఠం భూమి హైకోర్టులో పెండింగ్ ఉంది. ప్రస్తుతం ఈ భూమి పైకి ఎవరికీ ఎటువంటి హక్కులు లేదు. ఈ భూమిపై కోర్టు ఆదేశాల ప్రకారం ఎటువంటి నిర్మాణాలు గాని, ఆక్రమణలు గాని చేపట్టరాదు. ఈ భూమికి సంబంధించి పంచాయతీ అధికారులూ స్పందించాలి. ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కోర్టు ఆదేశాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

– సనపల కిరణ్‌కుమార్, తహశీల్దార్

ఎటువంటి ఫిర్యాదూ రాలేదు

జె.ఆర్.పురం పంచాయతీ సర్వే నంబరు-2లోని గ్రామ కంఠంలో 18 సెంట్ల భూమికి సంబంధించి ఒక ప్రయివేటు వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య వివాదం ఉన్నట్లు తమకు ఫిర్యాదు అందింది. అయితే సంబంధించిన కేసు హైకోర్టులో ఉండడంతో ఈ స్థలంపైకి ఎవరూ వెళ్లకూడదని నిబంధన ఉంది. అయితే ఈ స్థలంలో ఆక్రమణకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు గాని, సంబంధిత అధికారులు గాని ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, ఎస్ఐ

ఎమ్మెల్యే దృష్టికి ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో చీపురుపల్లి ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారానికి అందలేదని ఉప సర్పంచ్ పిట్ట సవరయ్య, నిర్వాసితులు ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామంలో 24 మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు యు.బాలరాజు,సర్పంచ్ యవ్వరి ఈశ్వరరావు, తెంబూరు ప్రసాదరావు, రామకృష్ణ, బాలరాజు, ఎస్ఐ టి.రాజేష్ పాల్గొన్నారు.

జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

మెళియాపుట్టిలోని వెలుగు కార్యాలయంలో ఐటిడిఎ ఆధ్వర్యాన జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. రూ.15 లక్షలతో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎపిఎం లలిత తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. స్థానిక మహిళలతో కలిసి సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడపిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉల్లాన బాలరాజు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిటిసి ప్రతినిధి జైమునిరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

ఉప ఎన్నికల్లోనూ వైసిపి జోరు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నియోజకవర్గంలో ఒక సర్పంచ్, 11వ వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించామని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ఆమె స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ముఖ్యమంత్రిపై పెట్టుకున్న నమ్మకం మరోసారి రుజువైందని చెప్పారు. ఎన్నికలు ఏవైనా వైసిపిదే విజయమని మరోసారి రుజువైందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, కింతళి ధర్మారావు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాణి

పాముకాటుతో వ్యక్తి మృతి

పొందూరు: మండలంలోని బురిడికంచరాంకు చెందిన వండాన భాస్కరరావు (35) పాముకాటుతో సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఆదివారం సాయంత్రం పొలం పనికి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రి పొలంలో వెతికినా దొరకలేదు. ఉదయాన్నే అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు నోటిలో నురగతో భాస్కరరావు మృతి చెందడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు చేరుకున్న కుటుంబ సభ్యులు పాముకాటుకు గురై విగతజీవిగా పడి ఉన్న భాస్కరరావును చూసి రోధించారు. మృతుడు చిలకపాలెంలోని ఎన్‌ఎసిఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకుని సాయంత్రం పొలంలో మందు కొట్టేందుకు వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా బలంగా పాముకాటు వేయడంతో మృతి చెందాడని భావిస్తున్నారు. మృతునికి భార్య పావని, కుమార్తె లాస్య, కుమారుడు మనోహర్‌నాయుడులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆకాశ కెరియర్స్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



శరత్‌బాబు దుర్గాప్రసాద్

కేంద్ర రక్షణ శాఖ చేపట్టిన ఎస్ఎస్‌సి జిడి పోస్టులకు జిల్లాలోని శ్రీఆకాశ కెరీయర్స్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని సంస్థ డైరెక్టర్ సిహెచ్. వెంకట్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఎంపికైన ఆర్.శరత్‌బాబు, దుర్గారావులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థ నుంచి క్రమం తప్పకుండా అగ్నివీర్, నేవీలో వెంకటేష్ ఉద్యోగం సాధించగా, ఇప్పుడు ఇద్దరు విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత మంది విద్యార్థులు ఉద్యోగాల్లో చేరేందుకు తోడ్పడుతుందని అన్నారు. వారికి అందించిన మెళుకువలు, పోటీ పరీక్షల్లో వారు కనబరచిన తీరును తోటి విద్యార్థులకు తెలియజెప్పి మరింత మందిని ప్రోత్సహించగలమన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు : మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బాణాం, ధర్మపురం, కింతలి, లోలుగు, మొదలవలస, పొందూరు, రాపాక, వి.ఆర్.గూడెంలలో ఒక్కో పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 26లోగా దరఖాస్తును ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

అర్హులందరికీ పథకాలు

పలాస : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని, అవి అందరికీ అందేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మెప్మా అధికారులకు సూచించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మెప్మా అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాధ్యతగా పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

అపారిశుధ్య నిర్మూలనకు కృషి

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అపారిశుధ్యం నిర్మూలనకు కృషి చేస్తున్నామని, దీనికి ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. నూతనంగా కొనుగోలు చేసిన చెత్త సేకరణ వాహనాన్ని కమిషనర్ టి.నాగేంద్రబాబుతో కలిసి పరిశీలించారు. జంట పట్టణాల్లో ప్రజలు చెత్తా చెదారాలను కాలువల్లో వేయడంతో అపరిశుభ్రంగా తయారవుతుందని, దీనిని నిర్మూలించాలని కోరారు.

కళాకారునికి సన్మానం

రణస్థలం : బ్యాండ్ కళా రంగంలో విశేష సేవలందించిన రణస్థలానికి చెందిన సీనియర్ బ్యాండు కళాకారులు పరిమెళ్ల సత్యనారాయణకు సోమవారం సన్మానించారు. దర్శకరత్న దాసరి ఆత్మీయ పురస్కారాల్లో భాగంగా విశాఖపట్నంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యనారాయణ తన ప్రతిభతో ఉత్తరాంధ్రకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని కొనియాడారు.

తాగునీటి కుళాయి పనులు వేగవంతం



లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గంలో తాగునీటి కుళాయి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాలుగు మండలాల గ్రామీణ నీటి సరఫరా భాగం అధికారులతో సోమవారం సమీక్షించారు. కార్యక్రమంలో జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ పి.సూర్యనారాయణ, జెఇలు రామారావు, దివ్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

లావేరు : గతంలోని టిడిపి పాలనలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, వైసిపి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో రూ.76 లక్షలతో నిర్మించిన రహదారి శిలాఫకాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ టిడిపి హయాంలో ఓ చెరువులో నాలుగు తట్టలు మట్టి తీసి రూ. 40 లక్షలు బిల్లులు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. వైసిపి పాలనలో అంతా పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. వెంకటాపురంలో ఇప్పటి వరకూ రూ.4.16 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, జెసిఎస్ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బురాడ చిన్నారావు, మాజీ ఎంపిపి డి.రాజనాయుడు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న హెల్పింగ్ పీపుల్ సభ్యులు



నగదు అందిస్తున్న గణేష్ యువజన సంఘం సభ్యులు

చిన్నారికి అండ

కవిటి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఆద్యకు దాతలు అండగా నిలుస్తున్నారు. హెల్పింగ్ పీపుల్ అనే స్వచ్ఛంద సంస్థ పాప వైద్యం కోసం రూ.25 వేలు అందించి తమ ఉదారత చాటుకుంది. సంస్థ ప్రతినిధులు బదకల అఖిల్, బదకల శివ, యాంద్రాపు బెనర్జీ పాప తండ్రి చిరంజీవికి సోమవారం నగదు అందజేశారు. అదే విధంగా గొండ్యాలపుట్టుగకు చెందిన గణేష్ యువజన సంఘం రూ.20 వేలు, ఎం.ఎస్.పల్లికి చెందిన ఎస్ఎంఎస్ గ్రూప్ రూ.5 వేలు, కిమ్మోజు రవిశంకర్ రూ.5 వేలు పాప వైద్యం కోసం అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాశీబుగ్గ విద్యుత్ ఎఇ నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ హరి శంకర్ థియేటర్, మూడు రోడ్లు కూడలి, తిలక్‌నగర్, మల్లేశ్వర ఆస్పత్రి రోడ్, బాలకృష్ణ ఆస్పత్రి రోడ్డు, ఆంధ్రా బ్యాంకు రోడ్, గున్నేశ్వర నగర్, ఎస్ఎండి కాంప్లెక్స్ ఏరియా, న్యూ కాలనీ, దుర్గ మండపమ, పోలీస్‌స్టేషన్, పెద్దబ్రాహ్మణ వీధి, చిన్నబ్రాహ్మణ వీధి, పూజారి వీధి, వెంకటేశ్వర కాలనీ, ఫిష్ మార్కెట్, మేదరవీధి, నిత్యానంద నగర్, మీసేవ సంత ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చంద్రబాబుతోనే మహిళాభివృద్ధి



బూర్జ: మాట్లాడుతున్న రవికుమార్

బూర్జ: బూర్జ మండలం అయ్యవారిపేటలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మహాశక్తి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళకు సంపూర్ణంగా రక్షణ కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వి.సీతారాంబాబునాయుడు, మజ్జి శ్రీరాములునాయుడు, లంక జగన్నాథంనాయుడు, ఎంపిటిసిలు, బిసి సెల్ అధ్యక్షులు పాల్గొన్నారు

లావేరు : నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మండలంలోని పెద్దకొత్తపేటలో టిడిపి మేనిఫెస్టోలో భాగంగా మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిని మినీ మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ అధికార ప్రతినిధి గంట సంధ్య, గజపతి, మెడబోయన శ్రీరామ్మూర్తి, రొక్కం సాంబమూర్తి, రొక్కం మధు, కె.రమణనాయుడు, కెల్లన శ్రీను, కె.త్రినాథరావు పాల్గొన్నారు.



లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కిడ్నీ వ్యాధిపై పరిశోధన



రోగితో మాట్లాడుతున్న నెఫ్రాలజిస్టు వైద్యులు

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని చిన్నపిల్లల కిడ్నీవ్యాధుల నిపుణులు డాక్టర్ అనిషా (పెడియాట్రిక్ నెఫ్రాలజిస్టు యూనివర్శిటీ ఆఫ్ నార్తు కరోలిన, అమెరికా), డాక్టర్ నివేదిత (నెఫ్రాలజిస్టు, సెయింట్ జాన్స్ మెడికల్ కళాశాల బెంగుళూరు), ఐసిఎంఆర్ డాక్టర్ బాలాజీలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిడ్నీ రోగులకు అందుతున్న డయాలసిస్ సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సేవలు అందజేస్తున్నారు... ఎన్ని రోజులు డయాలసిస్ కోసం కేంద్రానికి వస్తున్నారు.. రోగులకు ఏయే మందులు అందజేస్తున్నారు వంటి వివరాలు సేకరించారు. డయాలసిస్ కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశమై కిడ్నీ రోగులకు అందజేయాల్సిన సేవలను వివరించారు. 12 నుంచి 25 ఏళ్ల వయసు లోపు వారికి కిడ్నీ వ్యాధి సోకడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల నుంచి సమాచారం సేకరించి వైద్య బృందం ఉద్దాన ప్రాంతంలో గల పలు గ్రామాల్లో వారం రోజుల పాటు పర్యటించి చిన్నారుల నుంచి యువతకు సోకే కిడ్నీవ్యాధిపై సమగ్ర వివరాలు సేకరిస్తామని చెప్పారు. వారుతో పాటు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నూక కూర్మారావు, డాక్టర్ గీత, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నేషనల్ ఇనుస్యుట్ ఆఫ్ జార్జ్ ఇనుస్యూట్ గ్లోబల్ హెల్త్ సంయుక్తంగా చేపట్టిన సికెడియు ప్రాజెక్టు ద్వారా రంగోయి జెడ్‌పిహెచ్ స్కూల్‌లో 8,9,10 విద్యార్థులతో కిడ్నీ క్రానికల్ వ్యాధిపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిషా మాట్లాడుతూ ఎక్కువగా పౌష్టికాహారం, నీటిని తీసుకోవాలన్నారు. రోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డోపా నైవా, డాక్టర్ నివేదిత, ఎం.బాలాజీ, ఎం.వి.సత్యనారాయణ, స్వరూప, రాణి, ప్రభ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

కొత్తూరు : సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రకారం రెగ్యులర్ చేయాలని కెజిబివి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంఆర్‌సి వద్ద కార్యాలయం వద్ద భోజన సమయంలో ప్లకార్డులు చేతబట్టి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. చాలీచాలని జీతాలతో జీవనం కష్టతరంగా మారిందన్నారు. కార్యక్రమంలో రాజేష్, స్వప్న, అప్పలనాయుడు, గోవింద్, వెంకటరావు, బిందు, సంతోషి, సుజాత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజల జీవన ప్రమాణాలు పెంపునకు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. మండలంలోని కొండవూరు పంచాయతీలో రూ.13 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవనానికి, రూ.2 లక్షలు ఎంపిపి నిధులతో నిర్మిస్తున్న సిసి రహదారి నిర్మాణానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ కొల్లి భాస్కరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందని అన్నారు. జగనన్న గోరు ముద్ద పేరుతో బలవర్ధకమైన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు తూచా తప్పకుండా అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇప్పిలి అప్పన్న, వైస్ సర్పంచ్ లండ ఆనంద్, ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి, వైసిపి బూత్ కన్వీనర్ సూర్యనారాయణ, నాయకులు మద్దిలి తిరుపతిరావు, గోరకల రామారావు, అప్పారావు, వై.శ్రీను, కె.సింహాచలం, నగేష్, పాపారావు, తిరుపతి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి నీలవేణి

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు దుర్మరణం

ప్రజాశక్తి- బూర్జ



వసంత్ (ఫైల్)

మండలంలోని కొండపేట సిఎస్‌పి రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగాలపాడు గిరిజన గ్రామానికి చెందిన సవర వసంత్ (25) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగాలపేట గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై పాలకొండ వైపు వెళ్తున్న వెళ్తున్నారు. కొండపేట వద్ద వెనుక నుంచి వస్తున్న టిప్పర్ బలంగా కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గిలగిలా కొట్టుకుంటున్న క్షతగాత్రుడిని స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొద్ది క్షణాల్లోనే మృతి చెందాడు. ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మా ఇంటి దీపం ఆరిపోయింది

మా కుటుంబాన్ని పోషిస్తున్న మా ఇంటి దీపం ఆరిపోయిందని మృతుని భార్య సరస్వతమ్మ మృతదేహంపై పడి బోరున విలపిస్తోంది. మారుమూల అటవీ ప్రాంతంలో పోడు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మా కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయామని కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. ఇక మేము ఎలా బతకాలి, ఇక నా బిడ్డను ఎలా ఎలా పెంచాలి, ఎలా చదివించాలి, ఎలా జీవనం సాగించాలని ఆమె హృదయ విదారకంగా విలపించింది. అమ్మా నాన్న ఎక్కడున్నాడు... ఎప్పుడొస్తాడని అభం... శుభం తెలియని నా బిడ్డ నన్ను అడిగితే ఏం చెప్పాలని లబోదిబోమంటుంది.

క్రైమ్ కార్నర్

వంశధార కాలువలో పడి బాలుడు మృతి

కోటబొమ్మాళి: మండలంలోని కస్తూరిపాడు గ్రామ సమీపంలో ఉన్న వంశధార కాలువలో పడి ఒడిశా రాష్ట్రం రౌడ్‌కిలకు చెందిన నెయ్యిల దుర్గారావు (15) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు దుర్గారావు తన బంధువు అయిన కస్తూరిపాడుకు చెందిన నెయ్యిల అప్పన్న వివాహానికి ఈ నెల 19న తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. 20న సాయంత్రం స్నానానికని దగ్గరలో ఉన్న వంశధార కాలువకు మృతుడు దుర్గారావుతో పాటు చిన్ని, హరికృష్ణ వచ్చారు. స్నానానికి దిగగా కాలువలో నీరు ఉధృతంగా రావటంతో ఈత రాక దుర్గారావు కాలువలో కొట్టుకుపోయాడు. దీంతో గ్రామస్తులు కాలువలో గాలించగా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రిస్క్‌టీమ్ గాలింప చర్యలు చేపట్టగా ఆదివారం రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెచ్‌సి వై.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి...

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేటలో బోకర ఆనందరావు (34) చెరువులో జారిపడి సోమవారం మృతి చెందారు. ఉదయం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీపంలోని మాధనగోపాలసాగరం చెరువు వద్దకు వెళ్లారు. దీంతో ఒక్కసారిగా చెరువులో జారిపడడంతో మృతి చెందారు. ఎప్పటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న రాజశేఖర్

టిడిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి- మందస

మండలంలోని లింబుగాంకు చెందిన టిడిపి సోషల్ మీడియా కార్యకర్త తలగన రాజశేఖర్‌పై పలాస లేబర్ కాలనీకి చెందిన గేదెల సాయి సోమవారం దాడి చేశాడు. పోలీసులు, క్షతగాత్రుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లింబుగాంకు తలగాన రాజశేఖర్, నర్తు ఈశ్వరరావులు కలిసి కాశీబుగ్గ సాయిరాం మెస్‌లో భోజనం చేస్తున్నారు. వారిలో వారు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోసం మాట్లాడుకుంటున్నారు. వారి ఎదురుగా కూర్చున్న గేదెల సాయి మీది ఏ గ్రామమని అడిగారు. నీవు ఎవరో మాకు తెలియదు, మా విషయాలు నీకుందకని అనడంతో రాజశేఖర్‌పై సాయి దాడి చేసి ముఖం, కన్నుపై తీవ్రంగా గాయపరిచాడు. ఘటనా జరిగిన వెంటనే క్షతగాత్రుడును పలాస ప్రభుతాస్పత్రికి స్థానికులు తరలించారు. ఈ సందర్భంగా క్షతగాత్రుడు మాట్లాడుతూ తనపై దాడి చేయడమే కాకుండా తన వద్ద ఉన్న రూ.5 వేలు పట్టుకుపోయాడని తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ రూరల్ పోలీసులు తెలిపారు.

బైకు దొంగల హల్‌చల్

ఆమదాలవలస : పట్టణంలో రెండు రోజులుగా బైకు దొంగలు హల్‌చల్ చేస్తూ దొరికినంత వరకు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోవడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. వివరాలలోకి వెళ్తే... ఈ నెల 19న పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉదయం 8 గంటల సమయంలో స్నేహితుడికి ఫోన్ చేస్తామని చెప్పి తమ్మినేని భార్గవ్ దగ్గర నుంచి బైకు దొంగలు తీసుకొని వెంటనే అక్కడ నుంచి పరారయ్యారు. ఆదివారం రాత్రి లక్ష్ముడుపేట సమీపంలో పైడి అప్పలరాజు వద్ద కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తామని చెప్పి ఆయన వద్ద నుంచి ఫోన్‌ను తీసుకొని వెంటనే అక్కడ నుంచీ పరారయ్యారు. ఈ సంఘటనలపై ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సిసి ఫుటేజ్‌లో బైకు దొంగల ఛాయాచిత్రాలను సేకరించారు. పట్టణంలో వరుసగా జరుగుతున్న సంఘటనలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా పట్టణంలో బైకు దొంగలు మహిళల మెడలో ఉన్న బంగారాన్ని కూడా ఎత్తుకెళ్లారని గుర్తు చేస్తున్నారు.